భూకంపంతో
శిథిలమయి
మృత్యుమందిరంలా
మారిన యింటిలో
చిక్కిన అతని బతుకు?

# జీవసమాధి

బి.రఘురామ
రాజు
కథ


సెప్టెంబరు నెల. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం వల్ల వెన్ను జలదరించేలా హోరున ఈదురుగాలులు వీస్తున్నాయి. ఆకాశం పచ్చినీటి కుండలా వర్షించడానికి సిద్ధంగా వుంది. నల్లని ముసుగు ధరించిన దెయ్యంలా, భీకరంగా వుంది ప్రకృతి.

అమావాస్య. అర్ధరాత్రి. ప్రకృతి ఆలపిస్తున్న విషాద సంగీతంలా, కీచురాళ్ల రొద భయంకరంగా వినిపిస్తోంది. హంతకుడు ఝుళిపించిన చురకత్తిలా, ఎక్కడో దూరాన తళుక్కున మెరిసింది మెరుపు. వేయి మదపుటేనుగులు ఒక్కసారి ఘీంకరించినట్లు 'ఫెళ, ఫెళ, ఫెళ' మని గర్జించాయి కారుమేఘాలు. కీచురాళ్ల రొద అకస్మాత్తుగా ఆగిపోయింది. 'టపటప.. టపటప'... బుల్లెట్లలాగా భూమి గుండెని తాకుతున్నాయి వర్షపు చినుకులు.

ఆ చప్పుడుకి మెలకువ వచ్చింది ప్రజాపతికి. కళ్లు నులుముకుని చూశాడు. చుట్టూ దట్టమైన చీకటి! తలపై ఎవరో సమ్మెటతో బాదుతున్నట్టు విపరీతమైన తలనొప్పి! కణతల దగ్గర రెండు చేతులూ చేర్చి తల పట్టుకున్నాడు. కుడిచేతికి నుదురు తడిగా, వెచ్చగా తగిలింది. రక్తం! ఎక్కడిది? ఏమైంది తనకు? తనెక్కడున్నాడు? అంతా అయోమయంగా, భయం భయంగా వుందతనికి.

జరిగింది గుర్తు తెచ్చుకోసాగాడతను. దాదాపు ఇరవై గంటల క్రితం—

తెల్లవారుఝామున నాలుగ్గంటలకి కాస్త ముందు మెలకువ వస్తే, లేచి సిగరెట్టు కాల్చి మేను వాల్చాడు తను. మళ్లీ కునుకు



పడుతుండగా గూట్లో వున్న గాజు గ్లాసులను ఎవరో కదిలించిన చప్పుడు! పిల్లేమో అనుకున్నాడు రెండు క్షణాలు. పిల్లి కదలిక కాదది. గ్లాసులు ఒకదానికేసి ఒకటి కొట్టుకుంటున్నాయి సున్నితంగా, వేగంగా! ఇంతలో తను పడుకున్న మంచం ఊయలలా ఊగసాగింది! అప్పుడు గుర్తొచ్చిందతనికి, తను పడుకున్నది మంచం కాదని, దాని

పక్కనే వున్న నేలమీదని. ఐనా, ఊయలచేసే అందమైన కదలిక కాదది; ఏదో బలమైన రాక్షసహస్తం భుజాలు పట్టుకుని క్రూరంగా కుదుపుతున్న అనుభూతి! దెయ్యమా? ఛీ,ఛీ, అదేం ఆలోచన, అదీ తెల్లవారుతుండగా!

ఆశ్చర్యం అనుమానంగా, అనుమానం భయంగా మారింది క్షణాల్లో! శరీరమొక్కటే కాదు, ఇల్లు ఇల్లే కదులుతోంది— సముద్రపుటలల మీద ఊగిసలాడే పడవలాగా! కోటానుకోట్ల సంవత్సరాలుగా ప్రాణికోటిని మోస్తూ, విశ్వాంతరాళంలో క్రమపద్ధతిలో, లయబద్ధంగా పరిభ్రమించే భూగోళం కదలికలో చిన్న అపశ్రుతి! భూకంపం!

భూమి కంపిస్తోంది! అంతే గుర్తుంది తనకి!

ఛటుక్కున లేవబోయాడు ప్రజాపతి. ఒక్క అడుగు కూడా పైకి లేవకముందే నొసటిని గట్టిగా తాకింది బలమైన కర్ర. ఆ దెబ్బకి వెనక్కి పడిపోయాడతను మూల్గుతూ— తర్వాత పరిసరాల్ని భయంభయంగా తడమసాగాడు. అటూ, ఇటూ రెండుగుల దూరంలో కదిలించడానికి వీల్లేనంత బరువైన రాళ్ల కుప్పలా తగిలాయి. చేతుల్ని నిటారుగా పైకెత్తి డడిమాడు. మంచం బద్దె నుండి, భూమికి ఏటవాలుగా కొంచెం ఎత్తులో పడివున్న కర్రలు నాలుగైదు, వాటిపై ఒక ఇనుపరేకు తగిలాయి! బలమంతా చేతుల్లోకి తీసుకుని ఆ రేకుని పైకి తోయడానికి ప్రయత్నించాడతను. జబ్బలు కలుక్కుమన్నాయి తప్ప రేకు అంగుళం కదల్లేదు! కర్రలను కదిలించి చూశాడు.

ఒక కర్ర కొంచెం కదలగానే, ఓ వైపు నుండి రెండు రాళ్లు దొర్లుతూ వచ్చి రేకు మీదపడ్డాయి పెద్ద శబ్దం చేస్తూ.

ప్రమాదం జరగకుండా వుండాలంటే, తను శిథిలాల్ని కదిలించకుండా వుండడమే మంచిదనే నిర్ణయానికి వచ్చేశాడతను.

వెల్లకిలా పడున్న ప్రజాపతి, బోర్లా తిరిగి మోకాళ్లమీద, మోచేతులమీద శరీరాన్ని మోపి, అరచేతుల్ని చెవులకు ఆనించి, ఊపిరి బిగించి "రక్షించండి! ఎవరైనా ఇటురండి!'' అంటూ అరిచాడు బలమంతా కూడదీసుకుని. ఆ నిశిరాత్రి, ఆ నిర్జన ప్రదేశంలో అతని అరుపులు దిక్కులు పిక్కటిల్లేలా మార్మోగాయి భయంకరంగా!

తన పిలుపు విని ఎవరైనా సహాయానికి వస్తారేమోనని పది నిముషాలు నిరీక్షించాడతను. అతడి నిరీక్షణ వృథా అయింది. వర్షం మరింత వుధృతమైంది.

అర్ధరాత్రి. అంధకారం. సహాయానికి మనుషులెవరూ చుట్టుపక్కల లేరు. అందుబాటులో ఏ ఆయుధమూ లేదు. ఆకలితో ఈ రోజు కాకపోయినా, ఇంకొన్ని రోజులకైనా చావు తప్పదు తనకు! తనిక్కడే, ఇలాగే ఈ ఇంటి శిథిలాల కింద జీవసమాధి కావలసిందేనా? ఆ ఆలోచన రాగానే, భయం పుట్టి, మరోసారి గొంతెత్తి అరిచాడతను.

తన పిచ్చిగాని, ఈ అర్ధరాత్రిలో ఎవరికి వినిపిస్తుంది తన ఆక్రందన!

ఊళ్లో చాలామంది చనిపోయి వుంటారు ఈ భూకంపానికి. మహారాష్ట్రలోని కిలారీ గ్రామం అది. అది భూకంపాలకు నిలయమని, ఎవరెవరో ఎన్నిసార్లో చెప్పారు.

కాని ఇంటిని, బామ్మని వదిలేసి ఎక్కడికి వెళ్లగలడు తను?

ఊళ్లో ఇల్లు కూలి బామ్మ కూడా చనిపోయి వుంటుంది— వ్యవసాయపు బావి దగ్గర వున్న ఈ ఇంట్లో తను చిక్కుకుపోయిన సంగతి ప్రపంచానికెలా తెలుస్తుంది?


భూమి సృష్టించిన విలయతాండవానికి, గుండె కరిగి ఏడుస్తున్నట్టు ఆకాశం వర్షిస్తూనే వుంది. ఎడతెరిపి లేకుండా! వర్షపు నీరు మట్టిలోకి జారి, రాళ్లమధ్య ప్రవహిస్తూ, శరీరాన్ని తాకి వెన్నులో చలి పుట్టిస్తోంది. వర్షంలో తడిసిన దుప్పటి, అతడికి అండగా నిలవలేకపోతోంది. ఒక ప్రక్కకు ఒత్తిగిలి, వెచ్చదనం కోసం రెండు చేతులనూ తొడల మధ్యన చేర్చి, భుజాలు కుంచించి, పళ్ల బిగువు మాటున వణుకును అణుచుకుంటూ, చలితో యుద్ధం ప్రకటించాడు ప్రజాపతి.

వర్షం వెలిసింది కాస్సేపటికి. మెరుపులు, ఉరుములు తగ్గాయి క్రమంగా. చలి తగ్గుముఖం పట్టింది. నిద్ర అని దాన్ని అనలేకపోయినా, బాధను మరచిపోయే అలౌకిక స్థితికి చేరుకుంది ప్రజాపతి శరీరం.

* * *

మర్నాటి వుదయం, పక్షుల అరుపులకి మెలకువ వచ్చింది ప్రజాపతికి. సూర్యుడు ఆకాశంలోకి ఎగబాకుతున్నాడు పట్టుదలతో వున్న పర్వతారోహకుడిలా. వెలుతురు పెరుగుతున్న కొద్దీ, ఎవరైనా వచ్చి సాయం చేస్తారన్న ఆశ ప్రజాపతిలో పెరుగసాగింది. సూర్యోదయమై రెండు, మూడు గంటలైనా మనుషుల అలికిడే లేదు.

"ఎవరైనా వున్నారా చుట్టుపక్కల? రండి నన్ను బయటకు లాగండి!" గొంతు పడిపోయేదాకా, ఆపకుండా అరుస్తూనే వున్నాడతను. అతని అరుపులు ఆ శిథిల గృహంలో, పక్కనే వున్న ఆ బావిలో ప్రతిధ్వనించాయే తప్ప ఎవ్వరూ పలుకలేదు బదులుగా!



గొంతు తడారిపోయింది అరిచి, అరిచి. చెప్పలేనంత దాహం! చెంబుకోసం చేయి సాచాడతను. ఇల్లు కూలినప్పుడు, అదృష్టవశాత్తు, శిథిలాలేమీ దానిపై పడకుండా మంచం అడ్డంగా వుండడం వల్ల, నీళ్లు ఒలికిపోకుండా అలాగే వుండిపోయాయి. లేకుంటేనా! చెంబునందుకుని, నీళ్లన్నీ గడగడా తాగేయాలనుకొని చేయి సాచాడతను.

కానీ ఓ ఆలోచన వచ్చి తక్కున ఆగిపోయాడు. దురదృష్టవశాత్తు ఆ శిథిలాల కిందే తను చాలా రోజులు వుండిపోవాల్సి వస్తే? ఆకలి మాట సరేసరి, దాహం సంగతేమిటి?

చెంబులోని నీటిని గ్లాసులోకి వంచి చూశాడు. గ్లాసు నిండాక సగందాకా మిగిలాయి చెంబులో నీళ్లు. అంటే ప్రాణాధారమైన నీళ్లు, తన దగ్గర వున్నది కేవలం రెండు గ్లాసులన్నమాట!

ఎనిమిది రోజులపాటు ఎవరి సహాయం తనకి అందకపోయినా, దాహంతో చావకూడదు తను! అంటే రోజుకి గ్లాసులో నాలుగోవంతు కన్నా ఎక్కువ నీళ్లు ఖర్చు చేయరాదు. అదే ఆంక్ష విధించుకున్నాడతను తనకు తానుగా.

ఆరిపోయిన గొంతు తడుపుకోవడానికి, ఆ పావుగ్లాసెడు నీళ్లు సరిపోలేదని అనిపించింది ప్రజాపతికి. నీటిని సక్రమంగా కాపాడుకోవాలంటే, అనవసరంగా అరవడం కూడా తను మానేయాలని రెండో ఆంక్ష విధించుకున్నాడు. సమీపంలో ఎవరిదైనా అలికిడి అయితే తప్ప, ఉన్న కాస్త నీటిని, శక్తిని వృధా చేయకూడదని నిశ్చయించుకున్నాడు.

మధ్యాహ్నమైంది. గతరాత్రి వర్షం కురిసినందువల్లనో ఏమో, భూమిలోంచి వేడి పుట్టుకొస్తోంది భరించలేనంతగా! పైగా ఓర్చుకోలేనంత ఆకలి. ఎవరూ సాయపడకపోతే, ఒక్కడిగా తను ఆ శిథిలాల నుండి బైటపడ్డం కల్ల.

బ్రతకడం అసాధ్యమని అనిపించిన కొద్దీ, బ్రతకాలన్న ఆశ అతనిలో అధికం కాసాగింది! తను చావరాదు. ఎలాగైనా సరే బ్రతికి, బాహ్య ప్రపంచాన్ని మళ్లీ చూడాగి తను!

సాయంత్రం గడిచిన కొద్దీ, అతనిలో ఆశ సన్నగిల్లసాగింది. వేడికి చెమట బాగా పట్టడంతో నాలుక పిడచకడులోంది దాహంతో. కాని ఆ రోజు వంతు నీటిని అంతకుమునుపే తాగి వుండడంతో, చెంబులోని నీటివైపు జాలిగా చూశాడు ప్రజాపతి.

చీకటి ముసురుకొంది పెనుభూతంలా! ప్రజాపతిని భయకంపితుణ్ణి చేయడానికి ప్రకృతి మరోసారి కంకణం కట్టుకుంది.

* * *

అర్ధరాత్రి కావస్తుండగా, మగత నిద్రలోకి జారుకున్నాడతను. ఇంతలో పక్కనున్న బావిలోంచి వచ్చిన నీటి అలికిడికి మెలకువ వచ్చి, చెవులు రిక్కించి వినసాగాడు ప్రజాపతి. అలికిడి మరింత ఎక్కువైంది. మనిషా? పగలంతా ఒక్కరూ కనబడని మనుషులు అంతా రాత్రివేళ ఎందుకు వస్తారు?

ఏమైనా సరే, వచ్చిన అవకాశాన్ని జారవిడుచదలచుకోలేదు అతను. రెండు చేతులు నోటి దగ్గర చేర్చి, గొంతెత్తి బిగ్గరగా

అరిచాడు. రెండు నిమిషాలైంది. నీటి దగ్గర అలికిడి తక్కువైంది క్రమంగా. బావిలోంచి, కూలిపోయిన తన యింటివైపు ఎవరో నడుస్తున్న చప్పుడు. చాలా మెత్తగా పడుతున్న ఆ అడుగులు మనిషివి కావు నిస్సందేహంగా. మరెవ్వరివి? ఆ అడుగులు చేరువయ్యాయి. తనపై ఆవరించిన ఆ శిథిలాల మీద ఆ అడుగుల తాలూకు ఆకారం నడుస్తోంది నిశ్శబ్దంగా! సరిగ్గా తను పడివున్న ప్రాంతానికి పైభాగంలో ఆగిపోయి శిథిలాలను పసికడుతోంది తీక్షణంగా.

ఇన్ని శిథిలాలు తనకు రక్షణ కవచంలా వున్నందువల్ల, ఆ జంతువో మరేదో తననేమీ చేయలేదని ధైర్యం కలిగింది అతనికి. ఏ శిథిలాలు తన్ను బైటపటకుండా నిరోధిస్తున్నాయో, ఆ శిథిలాలే ప్రాణభిక్ష పెడుతున్నాయి యిప్పుడు.


మెదడు చిన్నదైనా, జంతువులకుండే జ్ఞానేంద్రియశక్తి మనిషికన్నా చాలా ఎక్కువ. ఎంతో దూరాన వున్న మనిషి ఉనికిని తెలుసుకోగలవు అవి. తనకి తెలియకుండా వచ్చి అది అమాంతం మీదపడితే? ఎదుర్కోవడానికి ఏ ఆయుధమూ లేదు—

తన దగ్గర, స్టీలు గ్లాసు తప్ప! గ్లాసుని కుడిచేత్తో బిగించి పట్టుకున్నాడు—— ఆకలితో నీరసించిన శరీరం అతడికి సహకరించలేదు.

శిథిలాల మీద తచ్చాడుతున్న జంతువు పసికట్టడాన్ని తీవ్రం చేసింది. మెత్తని దాని అడుగులు బలంగా భారంగా పడుతున్నాయి, సమయం గడిచినకొద్దీ.

ఇక తను చేయగలిగింది, గొంతు చించుకుని అరవడమే. మిగిలి వున్న బలాన్నంతా గొంతులో సమీకరించి, కంఠనాళాలు తెగిపోయేటట్టు బిగ్గరగా కేకవేశాడతను. ఏమరుపాటుగా వున్న ఆ జంతువు, కేక వినగానే ఒక్కసారి వులికిపడి ఎగిరి గంతేసింది. అంతే! ఆ కదలికకు ఒక పెద్దరాయి దొర్లుతూ వచ్చి రేకుమీద పడడంతో, మరో పెద్ద శబ్దం బయలుదేరి దాన్ని మరింత

## టిఫిన్



ఒక జోకిస్టు హోటల్‌కెళ్లి సరదాగా సర్వర్‌తో 'టిఫిన్ నిన్నటిదా, మొన్నటిదా! యివాల్టిది ఉందేమో చూడు' అన్నాడు.

సర్వర్ వినయంగా 'అయితే రేపు రండిసార్' అన్నాడు.

– ఎస్.రవి
(కాకినాడ)

భయపెట్టింది. శిథిలాల నుండి బయటికి గెంతుతూ ఆ జంతువు భయంకరంగా అరిచింది, ప్రాణభయంతో! చిరుతపులి గాండ్రింపు అది.

రాత్రి అంతా నిద్రపోకుండా మెలకువగానే వున్నాడతను. అంత దగ్గరలో అందుబాటులో ఆహారం వున్నా, తను, ఏమీ చేయలేకపోతున్నందుకు కోపంతో రాత్రంతా అరుస్తూనే వుంది ఆ చిరుతపులి.

చుట్టూ దట్టంగా ఆవరించిన ఆ చీకటి చెర నుండి బయట పడడానికి, సూర్యుడి రాకకోసం వేయికళ్లతో నిరీక్షించసాగాడు ప్రజాపతి.

* * *

అవతల ఏదో అతిముఖ్యమైన పని వున్నట్టు, హడావిడిగా వుదయించాడు సూర్యుడు. ప్రజాపతికి మెలకువ వచ్చింది. రాత్రి ఎదురైన అనుభవం గుర్తుకు రాగానే ఒళ్లు జలదరించింది అతనికి.

కేవలం మూడు నాలుగు అడుగుల దూరంలో నిలబడి, మృత్యువు తనని ఎగతాళి చేసింది పులిరూపంలో. విరిగిపడి, కేవలం రెండడుగుల ఎత్తులో ఆగిపోయిన కప్పుకు, పిడికిలి బిగించి గుద్దాడు ప్రజాపతి కసిగా! చేయి నొప్పి పుట్టడంతో బాధగా మూల్గాడతను.

ఆకలి దంచేస్తోంది. జ్వరం వచ్చినట్లు ఒళ్లంతా నొప్పులు. కాస్త గాలి అయినా స్వేచ్ఛగా పీల్చుదామంటే అడ్డంగా ఈ శిథిలాలొకటి!

దాహం తీర్చుకోవడానికి, ఆ రోజు వంతు పావు గ్లాసెడు నీళ్ల కోసం చేయి చాస్తుండగా ఆ శబ్దం వినిపించింది అతనికి. "కిచ్, కిచ్, కిచ్!" చుట్టూ పరిశీలనగా చూశాడు ప్రజాపతి. మంచంకింద అస్పష్టమైన వెలుగులో, మీసాలు అటూ, ఇటూ వేగంగా కదిలిస్తూ గెంతుతోంది ఓ ఎలుక. "ష్, ష్!" దాన్ని దూరంగా తరమడానికి బలహీనంగా చప్పుడు చేశాడతను. దూరంగా పారిపోయి, మరో అర నిముషానికే ఎలుక మళ్లీ ప్రత్యక్షమైంది, ఇంకాస్త గట్టిగా అరుస్తూ.

దాన్ని మళ్లీ బెదిరించడానికి కూడా అతనిలో ఓపికా, బలమూ మిగల్లేదు. నీళ్లు తాగడం మరిచిపోయి, ఆ ఎలుకవైపే నిశ్శబ్దంగా చూస్తుండిపోయాడతను.

చాచి వుంచిన ఎడమకాలి చిటికెన వేలిని ఆ ఎలుక కసుక్కున కొరికేయడంతో అదిరిపడ్డాడు ప్రజాపతి. అప్రయత్నంగా కాలిని తడిమిన అతని కుడి చేతికి రక్తం వెచ్చగా తగిలింది. తన కేకకు ఐదు నిమిషాలపాటు మాయమై, మళ్లీ 'కిచ్‌కిచ్' మంటూ వికృతంగా అరుస్తూ తన కాలివేళ్లను వెదుకుతోంది ఆ ఎలుక!

ఎలుకలకి ఆకలి ఎక్కువ. తప్పని పరిస్థితుల్లో, మనిషిని చంపి తినడానికి కూడా అవి వెనుకాడవు అని ఎక్కడో చదివినట్లు గుర్తొచ్చింది అతనికి.

ఆ ఎలుకను వూరికే వదలరాదు తను, చుట్టూ ఆయుధం కోసం అతను వెదకసాగాడు.

మళ్ళీ స్టీలుగ్లాసే దిక్కయింది. గ్లాసుని తలకిందులుగా తిప్పి పట్టుకుని దాన్ని

ఎలుకపై మూసేసి చంపాలని అతని ఎత్తుగడ! ఎగిరెగిరి, ఎలుక కనిపించిన చోటల్లా గ్లాసుని భూమ్మీద బోర్లించాడతను వేగంగా.

పాలిచ్చే జంతువుల్లో, శరీరం ఎంత చిన్నదైతే చురుకుదనం అంత ఎక్కువని ఎక్కడో చదివిన గుర్తు తనకి. అటూ, ఇటూ గెంతి అలిసిపోయాడే కాని ఎలుకను చంపలేకపోయాడు ప్రజాపతి. ఎలుక శిథిలాల కింద మాయమైంది. భయం భయంగా నిద్ర పట్టింది.

కలలో కూడా ఆ ఎలుకే! పొడవైన మీసాలతో, చురుకైన కళ్లతో తననే వెంటాడుతోంది. ఇంతలో 'కీచ్, కీచ్' మని శబ్దం వినిపించింది చెవులు చిల్లులు పడేలా. ఆ శబ్దం కలలోని ఎలుకది కాదు. నిజప్రపంచంలో ఇందాకా తనను వెంటాడి వేధించిన ఎలుకది. దిగ్గున మేల్కొన్నాడు ప్రజాపతి, భయంతో కళ్లు పెద్దవిచేస్తూ.

తీవ్రస్థాయిలో వున్న ఎలుక అరుపు రానురాను బలహీన పడి నిశ్శబ్దం ఆవరించింది. అది తన శరీరంలోని ఏ భాగంపై దాడిచేస్తుందోనని అప్రమత్తంగా ఎదురు చూస్తున్నాడతను.

నల్లని నల్లని ఆ ఎలుకని నోట కరచుకుని తన ఎదపై తాడులాంటి ఆకారం ఒకటి అస్పష్టంగా పాకుతోంది మధ్యలో ఆగిఆగి! రెప్పవాల్చడం మరచిపోయి, దానివంకే చూస్తుండిపోయాడతను. దాదాపు ఐదడుగుల పొడవున్న తాచుపాము అది!

అది కనుమరుగైన తర్వాత కూడా, చాలా సేపటిదాకా ప్రజాపతి గుండెవేగం తగ్గలేదు. మానసికంగా బాగా అలిసిపోవడంతో, వెంటనే అతనికి నిద్రపట్టింది గాఢంగా.

చీకటి పడ్డంతో, ప్రకృతి మరోసారి నల్లముసుగు ధరించింది.

* * *

## అలవాట్లు



మెక్సికన్ జాతీయులు చీమలను దంచి ఆ పొడి తింటారు. పేడ పురుగులు, పంచదార కలిపి సారాచేసి తాగుతారు. ఆస్ట్రేలియా ఆదిమజాతుల వారు సీతాకోక చిలుకలను ఉడికించి తింటారు. చైనావారు కప్పలు, పాములు, జపాన్ వారు గుర్రపు మాంసం, కొరియన్‌లకు కుక్కల మాంసం అంటే ప్రీతి. కెన్యాలోని మసై తెగవారు పశువులు తినే గడ్డి తింటారు. టిబెట్ ప్రజలు జడలబర్రె మాంసం ఎండబెట్టి వండకుండా తింటారు. థాయిలాండ్ వారికి వేయించిన ఎలుక మాంసం ఇష్టం. మలేషియా, సింగపూర్‌లోని కొందరు పెద్దపులుల మాంసం తింటారు.

—డాక్టర్ ఆళ్ల

అర్ధరాత్రి గాఢనిద్రలో వున్న ప్రజాపతి కి మనుషుల మాటలు లీలగా వినిపిస్తున్నాయి. సహాయం కోసం వెంటనే అరుద్దామని అనుకున్నాడు. కాని తిండిలేక కృశించిన అతని శరీరం వెంటనే స్పందించలేదు. అదే మేలైంది.

"ఎంతైనా, నువ్వా ముసలాణ్ణి చంపి వుండాల్సింది కాదురా!" అన్నాడు ఒకడు అందులో— "నేను మాత్రం చంపాలని చంపానా? పని పూర్తయ్యాక బయటకు వస్తుంటే, కాలు పట్టుకుని వదల్లేదు ఆ ముసలిపీనుగ. నువ్వేమో ఆ పాటికే బయట పడ్డావు హాయిగా. ఒక్కణ్ణే పట్టుబడి పోతానే మోనని భయంతో పొడిచానంతే!" రెండవ వాడు సంజాయిషీ యిచ్చుకుంటున్నాడు.

"దొంగతనం కన్నా హత్యకేసులో ఇరుక్కోవడం చాలా ప్రమాదమని ఎన్నిసార్లు చెప్పినా నీ తలకెక్కదు. సరే అయిందేదో అయింది. దూరంగా పారిపోవాలి మనం వెంటనే!" మొదటివాడు హెచ్చరించాడు.

అగ్గిపుల్ల గీసిన చప్పుడు. బీడీయో, సిగరెట్టో వెలిగించినట్లున్నారు.

"వాళ్ల రహస్యాలు తను విన్నాడు. ఇప్పుడు రక్షించమని అరిస్తే, రక్షించడం మాట అటుంచి తలమీద నాలుగురాళ్ళు విసిరి చంపేస్తారు అనుమానంతో!" అనుకుని ఆ ప్రయత్నం మానుకున్నాడు ప్రజాపతి భయంతో.

* * *

కిలారికి పది కి.మీ. దూరంలో వున్న చిన్నసైజు నగరమది.

రెండడుగుల ఎత్తూ, మూడడుగుల పొడవు వున్న ఆ అల్సేషియన్ డాగ్ రక్తపు మడుగులో పడున్న చమన్‌లాల్ శవం చుట్టూ శ్రద్ధగా నాలుగైదుసార్లు తిరిగింది. హంతకుడి ఆనవాళ్లకోసం వెదికింది ఓపిగ్గా. తర్వాత మోర గాల్లోకి సాచి, కళ్లు చిన్నవి చేసి, ఏదో పసిగట్టి, వెంటనే వింటినుండి దూసుకెళ్లిన బాణంలా పరుగు పెట్టింది.

డాగ్ ట్రెయినర్‌తోపాటు, ఒక ఇన్‌స్పెక్టర్, నలుగురు కానిస్టేబిల్స్ జీపులో వెంబడించారు దాన్ని.

"హంతకుణ్ణి పట్టుకోమంటే, ఇదేంటి పొలాల్లోకి వెళ్తోంది!" అసహనంగా అన్నాడు ఆ కుర్ర ఇన్‌స్పెక్టర్. "హంతకుడు ఈ ప్రాంతంలో ఆగి విశ్రాంతి తీసుకుని ముందుకు వెళ్లి వుంటాడు" అన్నాడు అనుభవజ్ఞుడైన డాగ్ ట్రెయినర్.

బావి గట్టున, కూలిపోయిన ఆ ఇంటి శిథిలాల చుట్టూ తిరుగుతూ నేలను పసిగట్టి 'భౌ, భౌ'మంది అల్సేషియన్. 'సిగరెట్ పీకలు!" ఆసక్తిగా అన్నారు కానిస్టేబిల్స్. తర్వాత మెరుపు వేగంతో శిథిలాల మీదకు దూకింది అల్సేషియన్. కూలిన రాళ్లమధ్య దేన్నో వెదుకుతూ బిగ్గరగా అరవసాగింది అది.

"శిథిలాలను తొలగించాలి!" సలహాయిచ్చాడు డాగ్ ట్రెయినర్. కానిస్టేబుల్స్ రంగంలోకి దిగారు.

ఐదురోజులపాటు మృత్యువుతో హోరాహోరి పోరాడి, ఆకలిదప్పులతో నీరసించి అపస్మారక స్థితిలో వున్న ప్రజాపతి శరీరం వాళ్లకి కనబడింది, శిథిలాల కింద.

"కదిలితే నిర్దాక్షిణ్యంగా కాల్చిపారేస్తాము" ! పిస్టల్ తీసి గురిపెడుతూ అన్నాడు ఆ క్రూర ఇన్‌స్పెక్టర్.

"హంతకులు కూలిపోయిన ఇళ్లకింద దాక్కోరు!" వ్యంగ్యంగా అన్నాడు డాగ్ ట్రెయినర్.

ప్రజాపతి ఎదమీద చెవి ఆనించి "ఇంకా బతికే వున్నాడు సార్!" ఆశ్చర్యంగా కానిస్టేబుళ్లలో ఒకరు.

"మొన్నటి భూకంపంలో ఈ శిథిలాల క్రింద చిక్కుకుని వుంటాడు. ఇతణ్ణి వెంటనే హాస్పిటల్‌కి తీసుకెళ్లాలి మనం" అన్నాడు డాగ్ ట్రెయినర్.

వాళ్ల మాటలకి కళ్లు తెరిచాడు ప్రజాపతి బలహీనంగా.

బావిగట్టున చెట్లమధ్య— భూకంపానికి నేలమట్టమై తనను నరకయాతనకు గురిచేసిన ఆ శిథిల గృహం, మృత్యుమందిరంలా భయంకరంగా కనబడింది అతని కళ్లకు.

తనకు ప్రాణభిక్ష పెట్టిన పోలీసు బృందం వంక ఓసారి కృతజ్ఞతా పూర్వకంగా నవ్వి మళ్లీ స్పృహతప్పాడు ప్రజాపతి.

అతణ్ణి ఆసుపత్రిలో చేర్పించడానికి, నగరంవైపు దూసుకుపోసాగింది పోలీసుజీపు.

*




## తెల్లమచ్చలు

30 గంటలలోనే తెల్లమచ్చలు మార్పు చెందడం ప్రారంభం. మరియు సహజమైన శరీరపు రంగులోనికి మారుతుంది. 7 రోజులకు మందు ఉచితం.



## నెరసిన జుట్టు

ఆయుర్వేద వైద్యంతో జుట్టు అకాల నెరవును అరికడుతుంది. తెల్లని జుట్టును నల్లగా మారుస్తుంది. జుట్టు రాలడాన్ని అరికడుతుంది. చికిత్స కోసం వెంటనే వ్రాయండి. ఒక సీసా రూ.35/- మూడుసీసాలు రూ.90/- పరీక్షకై మందు ఉచితం

## గుప్తరోగములు



స్త్రీ పురుషులు, దీర్ఘవ్యాధులు, శీఘ్రస్ఖలనం, అంగం బలహీనత, నపుంసకత్వం, సిఫిలిస్, గనేరియా తదితర సుఖవ్యాధులతో బాధపడుతున్నారా! స్త్రీలు లికోరియా, సంతానహీనత, ఋతుక్రమ లోపాలు, నెప్పులతో బాధపడుతున్నారా! చింతించకండి. మా నూతన పద్ధతిలో పరీక్షకై 7 రోజుల మందు ఉచితం. వ్యాధి వివరాలు తెలపండి. తప్పక ఫలితం వుంటుంది. చికిత్సకై సంప్రదించండి.

VIDYA MK MATHUR (MK)
P.O. Katri Saral (Gaya)